# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 11-11-2025** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **ఢిల్లీలోని ఎర్రకోట వద్ద జరిగిన పేలుడు ఘటనపై దర్యాప్తు కొనసాగుతోందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా వెల్లడించారు.**

2. **కేంద్ర వ్యవసాయ శాఖమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ఈరోజు గుంటూరులో జరిగే జాతీయ వాటర్ షెడ్ మహోత్సవంలో పాల్గొంటారు.**

3. **వందేమాతరం స్ఫూర్తితో దేశాభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ పని చేయాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పిలుపునిచ్చారు.**

4. **హైదరాబాదులో జూబ్లీ హిల్స్ ఉప ఎన్నికకు సంబంధించి పోలింగ్ మరి కొద్ది సేపట్లో ప్రారంభంకానున్నది.**

5. **ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ రంగాల్లో లక్ష కోట్ల రూపాయల పెట్టుబడులు వచ్చే విధంగా పలు నిర్ణయాలకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది.**

==========================

ఢిల్లీలోని ఎర్రకోట సమీపంలో గత సాయంత్రం కారులో జరిగిన భారీ పేలుడు ఘటనలో దాదాపు ఎనిమిది మంది మరణించగా, అనేక మంది గాయపడ్డారు. రాత్రి 7 గంటల ప్రాంతంలో లాల్‌ఖిలా మెట్రోస్టేషన్‌కు చేరువగా ట్రాఫిక్ సిగ్నల్ వద్ద కారు నుంచి పేలుడు సంభవించినట్లు అధికారులు తెలిపారు. కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ఢిల్లీ పోలీసు ఉన్నతాధికారులతో మాట్లాడి, పరిస్థితిని సమీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జాతీయ దర్యాప్తు సంస్థ -NIA, జాతీయ భద్రతా దళం -NSG ఫోరెన్సిక్స్ బృందాలు దర్యాప్తు ప్రారంభించాయని, పేలుడుకు సంబంధించిన ఖచ్చితమైన వివరాలు త్వరలో వెల్లడిస్తామని తెలిపారు.

వాయిస్.. 27 సెకన్లు

--------------------------

కేంద్ర వ్యవసాయ శాఖమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ఈరోజు గుంటూరు నగరంలో పర్యటిస్తారు. ఈసందర్భంగా నగరపరిధిలోని వెంగళాయపాలెంలో ఆధునికీకరించిన చెరువును ప్రారంభించి, అనంతరం నల్లపాడులోని లయోలా స్కూల్ గ్రౌండ్స్‌లో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మంత్రి పాల్గొంటారని అధికారులు తెలిపారు. అక్కడ జాతీయ వాటర్ షెడ్ మహోత్సవాన్ని లాంఛనంగా ప్రారంభించి, జనభగీరథ్ కప్ విజేతలకు

అవార్డులను అందచేస్తారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్, కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ పాల్గొననున్నారు.

---------------------------

వందేమాతరం స్ఫూర్తితో దేశాభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ పని చేయాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పిలుపునిచ్చారు. విజయవాడలోని తుమ్మలపల్లి కళా క్షేత్రంలో సాంస్కృతిక శాఖ నిర్వహించిన “150 వసంతాల వందేమాతరం” వేడుకల్లో ముఖ్యమంత్రి గత సాయంత్రం పాల్గొన్నారు. ఈ సందర్భంగా వందేమాతరం ప్రాముఖ్యాన్ని వివరిస్తూ ఏర్పాటు చేసిన ప్రదర్శనను తిలకించారు. బంకించంద్ర ఛటర్జీ, సీపీ బ్రౌన్ చిత్రపటాలకు పుష్పాంజలి ఘటించి వారిపై రూపొందించిన పుస్తకాలను ఆవిష్కరించి ప్రజలతో కలిసి వందేమాతరం గేయాన్ని ఆలపించారు. అనంతరం ముఖ్యమంత్రి ప్రసంగిస్తూ,

వాయిస్ 32 సెకన్లు

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ రంగాల్లో లక్ష కోట్ల రూపాయల పెట్టుబడులు వచ్చే విధంగా పలు నిర్ణయాలకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశ వివరాలను సమాచార, పౌర సంబంధాల శాఖా మంత్రి కొలుసు పార్థసారధి పాత్రికేయులకు వివరిస్తూ..

వాయిస్ 36 సెకన్లు

---------------------------

హైదరాబాదులో జూబ్లీ హిల్స్ ఉప ఎన్నికకు సంబంధించి పోలింగ్ మరి కొద్ది సేపట్లో ప్రారంభంకానున్నది. పోలింగ్ కోసం తెలంగాణ ఎన్నికల సంఘం విస్తృత స్థాయిలో ఏర్పాట్లు చేసింది. మొత్తం 407 కేంద్రాలలో పోలింగ్ జరుగుతోంది. నియోజక వర్గంలో మొత్తం ఓటర్ల సంఖ్య 3.99 లక్షలు కాగా … పురుష ఓటర్లు 2.07 లక్షలు, మహిళా ఓటర్లు 1.91 లక్షల మంది ఉన్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎన్నికల సంఘం పటిష్ఠ ఏర్పాట్లు చేసింది. పోలింగ్ సరళిని డ్రోన్ల ద్వారా పరిశీలిస్తున్నారు. ఈ ఎన్నికలో మొత్తం 58 మంది అభ్యర్థులు పోటీ చేస్తున్నారు. కాంగ్రెస్ అభ్యర్థిగా నవీన్ యాదవ్,.భారత రాష్ట్ర సమితి అభ్యర్థిగా మాగంటి సునీత, భారతీయ జనతా పార్టీ అభ్యర్థిగా ఎల్. దీపక్ రెడ్డి ఉన్నారు. ఈ నెల 14న కౌటింగ్ జరుగుతుంది.

---------------------------

ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన 50 సూక్ష్మ చిన్న మధ్యతరహా పరిశ్రమలు- ఎంఎస్ఎంఈ పార్కులకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈరోజు దృశ్యమాధ్యమం విధానంలో ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేస్తారు. ప్రకాశం జిల్లా కనిగిరి నియోజకవర్గం పెదఈర్లపాడు నుంచి ముఖ్యమంత్రి వీటికి ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేయనున్నారు. ఎంఎస్ఎంఈ పార్కుల ఏర్పాటులో రెండో దశ కింద 329 ఎకరాల్లో 134 కోట్ల రూపాయలతో 15 పారిశ్రామిక పార్కులను ముఖ్యమంత్రి ప్రారంభిస్తారు. వీటితో పాటు 587 ఎకరాల్లో అభివృద్ధి చేసేలా 32 ప్రభుత్వ ఎంఎస్ఎంఈ పార్కులు, 3 ప్రైవేటు ఎంఎంఎస్ఈ పార్కులకు చంద్రబాబు నాయుడు శంకుస్థాపన చేస్తారు. అలాగే ఈ పారిశ్రామిక పార్కుల్లో ఇప్పటికే నిర్మాణం పూర్తి చేసుకుని ఉత్పాదనకు సిద్ధంగా ఉన్న 28 కంపెనీలను ముఖ్యమంత్రి ప్రారంభిస్తారు.

---------------------------

ప్రజలకు విద్య ప్రాముఖ్యతను తెలియజేసే ఉద్దేశ్యంతో ఈరోజు జాతీయ విద్యా దినోత్సవం నిర్వహిస్తున్నారు. దేశంలో విద్యారంగాభివృద్ధికి విశేష కృషి చేసిన ప్రముఖ విద్యావేత్త మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ జయంతిని జాతీయ విద్యా దినోత్సవంగా నిర్వహిస్తున్నారు. 1888వ సంవత్సరం నవంబర్ 11వ తేదీన జన్మించిన ఆయన అసలు పేరు మొహియుద్దీన్ అహ్మద్ కాగా... అబుల్ కలాం ఆయనకు లభించిన బిరుదు. ఆజాద్ .... ఆయన కలం పేరు. స్వాతంత్ర్య సంగ్రామంలో కూడా మౌలానా కీలక పాత్ర పోషించారు. స్వాతంత్ర్య అనంతరం ఏర్పడిన భారత ప్రభుత్వంలో ఆయన విద్యా శాఖ మంత్రిగా వ్యవహరించి విద్యా రంగంలో సంస్కరణలకు విశేష కృషి చేశారు. యుజీసీ, ఐసీసీఆర్, ఎఐసిటియు, సీఐఎస్ఆర్.... వంటి ప్రతిష్టాత్మక సంస్థలతో పాటు ఖరగ్ పూర్ నగరంలో సాంకేతిక విద్యా సంస్థను ఏర్పాటు చేశారు. విద్యా దినోత్సవం సందర్భంగా చదువు విలువ గురించి అవగాహన కల్పించడానికి ఈరోజు కేంద్ర ..., రాష్ట్రాల విద్యా శాఖల ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు జరుగుతున్నాయి.

---------------------------

హైదరాబాదులో నిన్న మృతి చెందిన ప్రముఖ కవి, రచయిత అందెశ్రీ పార్థివదేహానికి ఈరోజు ఘటకేసర్‌లో ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు జరగనున్నాయి. తెలంగాణా ప్రముఖ కవులలో ఒకరుగా పేరు తెచ్చుకున్న ఆయన జనగాం జిల్లాలోని మద్దూరు మండలం రేబర్తి గ్రామంలో 1961వ సంవత్సరం జూలై 18వ తేదీన జన్మించారు. తెలంగాణా రాష్ట్ర సాధన కోసం జరిగిన ఉద్యమంలో కీలక పాత్ర పోషించారు. అందెశ్రీ రాసిన “జయ జయహే తెలంగాణ జనని జయ కేతనం” గీతాన్ని రాష్ట్ర ప్రభుత్వం అధికారిక గీతంగా స్వీకరించింది. అందెశ్రీ మృతి పట్ల ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణా రాష్ట్రాల ముఖ్యమంత్రులు నారా చంద్రబాబు నాయుడు, ఎ. రేవంత్ రెడ్డి, ఉప ముఖ్య మంత్రి కె. పవన్ కళ్యాణ్ ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ యానాం, దిగువ ట్రోపో ఆవరణంలో ఉత్తర ఈశాన్య దిశగా గాలులు వీస్తున్నాయని అమరావతిలోని భారత వాతావరణం కేంద్రం తెలిపింది. దీని ఫలితంగా ఆంధ్రప్రదేశ్‌లో పలు చోట్ల పొడి వాతావరణం కొనసాగుతుందని, అలాగే కొన్నిచోట్ల తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని అమరావతి వాతావరణ కేంద్రం అధికారి ఎమ్. వెంకట్రావు పేర్కొంటూ..

వాయిస్ 18 సెకన్లు

తెలంగాణలో రానున్న రెండు రోజుల పాటు వాతావరణం పొడిగా ఉంటుందని, ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పడాతయని, చలి పెరిగే అవకాశం ఉందని హైదరాబాదు వాతావరణ కేంద్రం తెలిపింది.

---------------------------

ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల భాగస్వామ్యంతో ఆంధ్రప్రదేశ్ పర్యాటక రంగాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. విజయవాడలోని గుణదలలో ఏపీ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఆధ్వర్యంలో టూరిజం స్టేక్ హోల్డర్లతో జరిగిన చర్చా వేదికలో మంత్రి నిన్న ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

=====================